



RNI No. TEL/TEL/2018/76342

# లోకంతీరు

LOKAMTEERU TELUGU DAILY సామాజిక, రాజకీయ దిన పత్రిక

ప్రచురణ : నిజామాబాద్ బుధవారం 24-07-2024 ఎడిటర్ : బ్యాగల్ శ్రీనివాస్ సంపుటి : 06 సంచిక : 193 పేజీలు : 4 వెల : రూ 2-00


## గద్వాల జిల్లాలో నేతన్న ఆత్మహత్య

జోగులాంబ గద్వాల,జూలై23( : తెలంగాణలో పదేళ్ల తరువాత మళ్లీ నేతన్నల ఆత్మహత్యలు చోటు చేసుకుంటున్నాయని బిఆర్ఎస్ ఆరోపిస్తోంది. గత ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలను, నేతన్నలకు ఆర్డర్లను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేస్తుండటంతో ఉపాధి లేక నేతన్నలు ఉరితాళ్లను ఆశ్రయిస్తున్నారు. తాజాగా జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలో కాకే పరమేష్ (52) అనే చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పుల బాధతో మనస్తాపానికి గురై ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని చేనేత కార్మికులు కోరుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో చేనేతకు అందించిన చేయూతను అర్ధాంతరంగా నిలిపివేయడంతోనే ఈ రంగం లో మరణమృదంగం మోగుతోందని నేతన్నలు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చీరాగానే వర్క్ ఆర్డర్లు నిలిపివేయడం,    పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


# బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం

**ఒక్క కేటాయింపు కూడా లేకపోవడం దారుణం**
**ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నా మిగిలింది సున్నా**
**స్వీయ అస్తిత్వమే మనకు శ్రీరామరక్ష అన్న కెటిఆర్**



హైదరాబాద్,జూలై23 : తెలుగు కోడలు నిర్మలా సీతారామన్ తెలంగాణ రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఈసారికూడా ఏమైనా భారీగా నిధులు కేటాయిస్తారని ఆశించాం.. దక్కింది శూన్యం అని కేటీఆర్ అన్నారు. కేంద్ర బడ్జెట్‌పై కేటీఆర్ స్పందిస్తూ.. బడ్జెట్ మొత్తంలో తెలంగాణ ప్రస్తావన లేకపోవడం బాధాకరమన్నారు. రూ. 48 లక్షలు ఇరవై ఒక్కవేల కోట్లతో బడ్జెట్ పెట్టినప్పటికీ కేవలం కొన్ని రాష్ట్రాలకు మాత్రమే పెద్దపీట వేశారు. తెలంగాణకు మరొకసారి దక్కింది గుండు సున్నానే అని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో దాదాపు 35 హామీల పైన నిర్ణయం తీసుకోవాలని గతంలో కేసీఆర్ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. అనేకసార్లు అభ్యర్థిస్తూ లేఖలు కూడా రాశాం. ములుగు యూనివర్సిటీకి అదనపునిధులు, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ.. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఊసే లేదు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోలేవటం లేదు అని కేటీఆర్ తెలిపారు. ఐఐఎం సహా నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ వంటి కేంద్ర జాతీయ సంస్థలను ఇవ్వమని మేము కోరినప్పటికీ ఒక్కటి కూడా ఇవ్వలేదు. తెలంగాణ నుంచి ముంబై- నాగపూర్, బెంగళూరు- చెన్నై వంటి మార్గాల్లో పారిశ్రామిక కారిడార్లకు నిధులు అడిగినప్పటికీ వాటి గురించి స్పందన లేదు. మెగా పవర్ లూమ్ క్లస్టర్‌తో పాటు నూతన హ్యాండ్లూమ్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని అడిగిన కూడా కేంద్రం స్పందించలేదన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి, మంత్రులు వెళ్లి ఢిల్లీలో అడిగిన వాటిని కూడా పట్టించుకోలేదు. తెలంగాణకు మరోసారి ఈ కేంద్ర బడ్జెట్ దక్కింది గుండు సున్నా. తెలంగాణలో 16 స్థానాలను బీజేపీ, కాంగ్రెస్ వంటి జాతీయ పార్టీలకు ఇస్తే ఏం జరిగిందో తెలంగాణ ప్రజలు ఆలోచించాలి. 16 స్థానాలు ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు, బీహార్‌కి దక్కిన నిధులను చూసైనా తెలంగాణ ప్రజలు ఆలోచన చేయాలి. స్వీయ రాజకీయ అస్తిత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష అన్న విషయాన్ని అర్థం చేసుకోవాల్సిన అవసరముంది.

# ఇలాంటి తీర్మానం ప్రవేశ పెట్టాల్సి వచ్చినందుకు బాధగా ఉంది: రేవంత్ రెడ్డి



హైదరాబాద్: తెలంగాణ శాసన బడ్జెట్ సమావేశాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. శాసన సభ ప్రారంభం కాగానే కంటోన్మెంట్ దివంగత ఎంఎల్ఎ లాస్య నందిత మృతికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీర్మానం ప్రవేశం పెట్టారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి ప్రసంగించారు. ఇలాంటి బాధాకరమైన తీర్మానం ప్రవేపెట్టాల్సి వచ్చినందుకు చాలా చింతిస్తున్నామని విచారం వ్యక్తం చేశారు. లాస్య నందిత తండ్రి, దివంగత ఎంఎల్ఎ సాయన్న తనకు అత్యంత సన్నిహితంగా ఉండేవారని, చాలా సంవత్సరాలు ఇద్దరం ప్రజాప్రతినిధులుగా కలిసి పని చేశామని, సాయన్న 1951లో నిజామాబాద్ జిల్లా వల్లభానగర్ లో అత్యంత సామాన్యమైన కుటుంబంలో సాయన్న జన్మించారని, జీవితంలో కష్టపడి ఐదుసార్లు ఎంఎల్ఏగా గెలిచి కంటోన్మెంట్ ప్రజలకు సేవలందించారని ప్రశంసించారు. ఆయన కంటోన్మెంట్ నిజయోకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు.ఎంఎల్ఏగా ఉన్నప్పుడు సాయన్న కన్నుమూయడంతో లాస్య నందిత తన తండ్రి వారసత్వాన్ని, బాధ్యతలను నెరవేర్చేందుకు రాజకీయాల్లోకి వచ్చారన్నారు. ఆయన బతికి ఉన్నప్పుడే ఆమె కార్పొరేటర్ గెలిచారని, లాస్య నందిత ఎంఎల్ఏగా గెలిచిన తరువాత కంటోన్మెంట్ ప్రజలు, మహిళల తరఫున చిత్తశుద్ధితో పోరాడుతున్న తరుణంలో ఆమె రోడ్డు ప్రమాదంలో మృతి చెందటం దురదృష్టకరమైన విషయమని బాధను వ్యక్తం చేశారు. కంటోన్మెంట్ నియోజకవర్గ ప్రజల హృదయాల్లో సాయన్న, లాస్యనందిత శాశ్వతంగా నిలిచిపోతారన్నారు. ఆమె మృతి పట్ల రేవంత్ సంతాపం తెలిపారు. ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## 2024 బడ్జెట్‌ను ప్రశంసించిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోడీ, నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన యూనియన్ బడ్జెట్-2024ను ప్రశంసించారు. 'ఈ బడ్జెట్ సమాజం లోని ప్రతి వర్గాన్ని బలోపేతం చేస్తుంది. ఈ బడ్జెట్ దేశంలోని పేదలు, గ్రామాలు, రైతులను సౌభాగ్యం దిశలో నడిపించనున్నది" అని ఆయన వీడియో సందేశం ద్వారా తెలిపారు."గత 10 ఏళ్లలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటప డ్డారు . ఈ బడ్జెట్ కొత్త మధ్యతరగతి సాధికారత కోసం. ఈ బడ్జెట్ ద్వారా యువతకు అపరిమిత అవకాశాలు లభిస్తాయి. ఈ బడ్జెట్ నుండి విద్య , నైపుణ్యం కొత్త స్థాయిని పొందు తాయి. ఈ బడ్జెట్ కొత్త మధ్యతం౯గతికి శక్తిని ఇస్తుంది.. ఈ బడ్జెట్ మహిళలు, చిన్న వ్యాపారులు, ఓూఓఇ లకు సహాయం చేస్తుంది, "అని మోడీ అన్నారు.విద్య , నైపుణ్యానికి బడ్జెట్ కొత్త పీఠం వేస్తుందని ప్రధాని అన్నారు. "ఇది మధ్యతరగతి ప్రజలకు కొత్త బలాన్ని ఇస్తుంది. గిరిజనులు, దళితులు , వెనుకబడిన వారిని బలోపేతం చేసే లక్ష్యంతో ఇది బలమైన పథకాలతో వచ్చింది. ఆర్థిక భాగస్వామ్యానికి భరోసా కల్పించేందుకు ఈ బడ్జెట్ తోడ్పడుతుంది" అని ప్రధాని మోడీ అన్నారు.



## 31వ తేదీ వరకు తెలంగాణ అసెంబ్లీ

**25వ తేదీన బడ్జెట్ ప్రవేశపెట్టనున్న భట్టి**
**బిఎసి సమావేశంలో సమావేశాల ఎజెండా ఖరారు**

హైదరాబాద్,జూలై23 : ఈ నెల 31వ తేదీ వరకు తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని బీఏసీలో నిర్ణయించారు. 25వ తేదీన బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. 26, 28 తేదీల్లో అసెంబ్లీకి సెలవు ప్రకటించారు. 31వ తేదీన ద్రవ్య వినిమయ బిల్లుకు శాసనసభ ఆమోదం తెలుపనుంది. బుధవారం పంటల రుణమాఫీపై చర్చ జరగనున్నట్లు సమాచారం. అలాగే జాబ్యాలెండర్‌పైనా కూడా చర్చ జరుగనుంది. బీఏసీ సమావేశానికి సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్‌లు, బీఆర్ఎస్ నుంచి హరీశ్‌రావు, ప్రశాంత్ రెడ్డి, బీజేపీ నుంచి మహేశ్వర్ రెడ్డి, సీపీఐ నుంచి కూనంనేని సాంబశివరావు, ఎంఐఎం నుంచి బలాల హాజరయ్యారు. కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతిపట్ల శాసనసభ ఇవాళ సంతాపం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆమె మృతికి సంతాపంగా సభ్యులందరూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం సభను బుధవారం ఉదయం 10 గంటలకు వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు.




# బడ్జెట్‌లో తెలంగాణకు తీరని అన్యాయం

**ఏపి, బీహార్‌ల కోసమే బడ్జెట్ పెట్టారు**
**మండిపడ్డ కాంగ్రెస్ తెలంగాణ ఎంపిలు**

న్యూఢిల్లీ,జూలై23 కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం చేశారని కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, కడియం కావ్య, గడ్డం వంశీకృష్ణలు అన్నారు. ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాల కోసమే బడ్జెట్ పెట్టినట్లు ఉందని విమర్శించారు. వాళ్ల ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకే రెండు రాష్ట్రాలకు కేటాయింపులు చేశారని మండిపడ్డారు. ఢిల్లీ వేదికగా మల్లు రవి మీడియాతో మాట్లాడుతూ... విభజన చట్టం గురించి చాలసార్లు ప్రస్తావించారు కానీ తెలంగాణ అన్న పదం కూడా వాడలేదని ధ్వజమెత్తారు. హైదరాబాద్ మినహా 9 జిల్లాలు వెనుకబడిన జిల్లాలుగా గుర్తించినప్పటికీ తెలంగాణకు కేటాయింపులు లేవని.. ఈవిషయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు నిధులు కేటాయించడంలో తమకు అభ్యంతరం లేదు, కానీ తెలంగాణకు కేటాయింపులు లేకపోవడం బాధాకరమని చెప్పారు. పాలమూరు జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి పూర్తిచేయాలని సీఎం, మంత్రులు విజ్ఞప్తి చేసిన పట్టించుకోలేదని అన్నారు. విభజన చట్టంలో తెలంగాణకు ఇచ్చిన హామీల ప్రస్తావన లేకపోవడం దారుణమని మండిపడ్డారు. తెలంగాణ నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు గెలిచారని, ఇద్దరు మంత్రులు ఉన్నారు అయిన తెలంగాణకు దక్కింది ఏం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలకు బీజేపీ ఎంపీలు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి బుద్ధిచెప్పాలని అన్నారు. తెలంగాణ హక్కుల సాధనకు అందరూ ఎంపీలు కలిసికట్టుగా పోరాడేందుకు ముందుకు రావాలని డిమాండ్ చేశారు. బీజేపీ, ఎంఐఎం ఎంపీలను కలిసి ఉమ్మడి పోరటాలపై చర్చిస్తామని తెలిపారు. తెలంగాణ హక్కుల సాధనకు అలుపులేని పోరాటం చేస్తామని ఎంపీ మల్లు రవి పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్ తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. తెలంగాణకు కేటాయింపుల్లో కేంద్రంలోని బీజేపీ పూర్తిగా విఫలమైందన్నారు వంశీకృష్ణ. తెలం గాణ ప్రజలకు బీజేపీ ఎంపీలను సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# కొన్ని మెరుపులు..మరికొన్ని విరుపులు..

**కొన్ని ఆశలు..మరికొన్ని ఆకాంక్షలు**
**9 ప్రాధాన్య అంశాల ఆధారంగా బడ్జెట్**
**వ్యవసారంగానికి పెద్దపీట వేస్తూ నిర్ణయం**
**నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనపై దృష్టి**
**స్థూలంగా బడ్జెట్ పరిమాణం రూ.48.21 కోట్లు**
**మొత్తం ఆదాయం రూ.32.07 లక్షల కోట్లు**
**పన్ను ఆదాయంఅంచనా రూ.28.83 లక్షల కోట్లు**
**ద్రవ్యలోటు 4.9 శాతంగా ఉండవచ్చని అంచనా**
**అప్పులు, పన్నేతర ఆదాయాలు రూ.16 లక్షల కోట్లు**
**అమరావతి నిర్మాణానికి 15వేల కోట్లు కేటాయింపు**
**పోలవరం పూర్తిచేసేందుకు వాగ్దానం**
**బీహార్‌లో మౌళిక వసతుల కల్పనలకు భారీగా కేటాయింపులు**
**బంగారం, ఫోన్స్ యాక్సరీస్‌పై సుంకాలు తగ్గింపు**




న్యూఢిల్లీ,జూలై23 : కొన్ని మెరుపులు..మరికొన్ని విరుపులు.. కొన్ని ఆశలు..మరికొన్ని ఆకాంక్షలతో ఎప్పటిలాగే ఉద్యోగుల ఇన్‌కమ్ ట్యాక్స్‌పై పెద్దగా సడలింపులు లేకుండా కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రతిపాదనలను ప్రవేశ పెట్టారు. కేంద్ర ప్రభుత్వం 9 ప్రాధాన్య అంశాల ఆధారంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఆర్థిక వ్యవస్థలో అవకాశాలను సృష్టించడమే లక్ష్యంగా ప్రాధాన్య అంశాలను ఎంపిక చేసుకుంది. వ్యవసాయ రంగంలో ఉత్పాదకత, ఉద్యోగ కల్పన- నైపుణ్యాభివృద్ధి, సామాజిక న్యాయం, పట్టణాభివృద్ధి, ఇంధన భద్రత, మౌలిక రంగం, పరిశోధన- ఆవిష్కరణలు, తయారీ-సేవలు, తర్వాత తరం సంస్కరణలు- ఈ తొమ్మిది అంశాలను ప్రాధాన్యంగా తీసుకున్నట్లు కేంద్రం ప్రకటించింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా ఏడోసారి బడ్జెట్ ప్రవేశపెడుతూ.. ఈ అంశాలను ప్రకటించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పూర్తి స్థాయి బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం లోక్ సభలో ప్రవేశ పెట్టారు. తొమ్మిది సూత్రాల ఆధారంగా బడ్జెట్‌రూపకల్పన చేసినట్లు చెప్పారు. వ్యవసాయ రంగంలో ఉత్పాదకత, ఉద్యోగ కల్పన, నైపుణ్యాభివృద్ధి, సామాజిక న్యాయం, పట్టణాభివృద్ధి, ఇంధన భద్రత, మౌలిక రంగం, పరిశోధన, ఆవిష్కరణలు, తయారీ,సేవలు, తర్వాతతరం సంస్కరణలు.. ఈ తొమ్మిది సూత్రాల ప్రాధాన్యంగా తీసుకుని బడ్జెట్ రూపొందించినట్లు తన ప్రసంగంలో విత్త మంత్రి ప్రకటించారు. ఇక ఈ బడ్జెట్ మొత్తంలో వివిధ రంగాలన్నింటికి కలిపి రూ.48.21 లక్షల కోట్ల కేటాయింపులు చేశారు. అంటే స్థూలంగా బడ్జెట్ పరిమాణం రూ.48.21 కోట్లు. ఇందులో మొత్తం ఆదాయాన్ని రూ.32.07 లక్షల కోట్లుగా, దానిలో పన్ను ఆదాయాన్ని రూ.28.83 లక్షల కోట్లుగా చూపించారు. ఈ ఏడాది ద్రవ్యలోటు 4.9 శాతంగా ఉండవచ్చని అంచనా వేశారు. అప్పులు, పన్నేతర ఆదాయాలు రూ.16 లక్షల కోట్లుగా అంచనా కట్టారు. అదేవిధంగా నూతన పింఛన్ విధానంలో త్వరలో మార్పులు చేయనున్నట్లు తెలిపారు. బడ్జెట్‌లో రైతులు,యువతపై ఎక్కువ దృష్టి పెట్టారు. యూత్ కు 2 లక్షల కోట్లు కేటాయించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రకటించారు. మొబైల్స్, బంగారంపై కస్టమ్స్ డ్యూటీని తగ్గించారు. ఆదాయపు పన్ను శ్లాబులను సవరించారు. అయితే ఉద్యోగస్థులకు పెద్దగా ఉరట కల్పించలేక పోయారు. టాప్ 500 కంపెనీలలో కోటి మంది యువతకు 12 నెలల ఇంటర్న్ షిప్ అవకాశాలు కల్పించేనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్న్ షిప్ భత్యంగా నెలకు రూ.5000, వన్ టైమ్ అసిస్టెన్స్ కింద రూ. 6000 ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇక కంపెనీలు ఇంటర్న్ షిప్ వ్యయంలో 12 శాతం భరించాల్సి ఉంటుంది. బీహార్, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై కూడా దృష్టి సారిస్తామని నిర్మలా సీతారామన్ అన్నారు. బీహార్ లో విమానాశ్రయాలు, మెడికల్ కాలేజ్ లు, క్రీడల మౌలిక వసతులు ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బీహార్, ఝార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఆందప్రదేశ్ రాష్ట్రాలను అభివృద్ధి పరుస్తామన్నారు. కాగా ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధికి రూ. 15000 కోట్లను కేటాయించారు. మొబైల్ ఫోన్లపై, యాక్సెసరీలపై, ఛార్జర్స్ పై 15 శాతం తగ్గింపు ఉంటుందన్నారు. ఉన్నత విద్య, దేశీయ సంస్థలకు రూ. 10 లక్ష ల కోట్లు కేటాయించారు. ఇకపోతే స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) లోటు 4.9 శాతం ఉండగలదన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 4.5 శాతం ఆర్థిక లోటుకే చేరుకోవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. వచ్చే రెండేళ్లలో కోటిమంది రైతులను ప్రకృతి వ్యవసాయం దిశగా ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. కూరగాయల ఉత్పత్తి పెద్దఎత్తున చేపట్టేలా క్లస్టర్లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయం, అనుబంధ రంగాలకు భారీగా కేటాయింపులు చేశారు. ముఖ్యంగా సేంద్రీయ వ్యవసాయంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాలకు రూ. 1.52 లక్షల కోట్లు కేటాయించినట్లు తెలిపారు. వచ్చే రెండేళ్లలో కోటి మంది రైతులు సేంద్రీయ వ్యవసాయంలోకి ప్రవేశించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వ్యవసాయంలో స్థిరమైన పద్ధతులు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, ఉత్పత్తి పెంపుదలపై దృష్టి సారించామని.. ఆ దిశగా కార్యక్రమాలు చేపడతున్నామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారమన్ తెలిపారు.అంతేకాదు.. వాతావరణ పరిస్థితులను తట్టుకునే, అధిక దిగుబడినిచ్చే ఉద్యానవన పంటలకు సంబంధించి 109 కొత్త వంగడాలను ప్రభుత్వం విడుదల చేయనున్నట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. వ్యసాయ రంగానికి కేటాయించిన రూ. రాష్ట్రాల భాగస్వామ్యంతో ప్రభుత్వం వ్యవసాయానికి డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్టక్చర్‌ను ప్రోత్సహిస్తుందని ప్రకటించారు. ఇక గ్రామీణాభివృద్ధి కోసం రూ. 2.66 లక్షల కోట్లు కేటాయిస్తున్నట్లు నిర్మలా సీతారామన్ ప్రకటించారు. వ్యవసాయ ఉత్పాదతకు పెంపొందించడానికి, వాతావరణాన్ని తట్టుకోగల రకాలను అభివృద్ధి చేయడానికి వ్యవసాయ పరిశోధన శాలను ఏర్పాటు చేయడంపై ప్రభుత్వం సమగ్ర సమీక్ష చేస్తుందన్నారు. ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన మధ్యంతర బ్జడెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. నూనెగింజల (మిగతా 2లో )

# సంపాదకీయం

బుధవారం 24-07-2024

## నియంతల పాలనకు లోక్‌పాల్‌తోనే చెక్ !

తెలుగు రాష్ట్రాల్లో ఇప్పుడు విపక్షంలో ఉన్న బిఆర్ఎస్, వైకాపాల తీరు ఒక్కటిగానే ఉంది. ప్రభుత్వంలో ఉండగా అలానే ఉండేది. ఇద్దరి మనస్థత్వాలు ఒక్కటే అన్నది మెల్లగా ఇప్పుడు జనాలకు అర్థం అవుతోంది. అధికారంలో ఉండగా అడ్డూ అదుపు లేకుండా వ్యవహరించారు. చరిత్రలో నియంతలను చూడకున్నా.. ఎలా ఉంటారో ఈ ఇద్దరినీ చూసిన వారికి అర్థం అయివుంటుంది. తెలంగాణ సెంటిమెంట్‌ను అడ్డం పెట్టుకుని నయా నియంతలా వ్యవహరించిన కెసిఆర్ రాష్ట్రాన్ని అప్పులకుప్పగా చేసి, వ్యవస్థలను భ్రష్టు పట్టించి.. ఇప్పుడు ఎదురుదాడి విమర్శలో తప్పులను కప్పి పుచ్చుకునే తంటాలు పడుతున్నారు. అందుకే అధికార రుచి మరిగిన ఈ ఇద్దరూ ..మరోమారు అధికారంలో ఉండేలా పథకాల రచన చేసి రాష్ట్రాలను దోచేశారు. ఇబ్బడి ముబ్బడిగా అప్పులు చేసి రాష్ట్రాలను దివాళా తీయించారు. పథకాల పేరుతో నగదును దోచి పెట్టారు. చేతికి ఎముక లేదన్నట్లుగా పథకాల రూపకల్పనతో నగదు బదిలీలు చేశారు. అభివృద్ధి పేరుతో అప్పులు చేసి సంపద సృష్టించామని గొప్పలు చెప్పారు. ప్యాలెస్‌లు కట్టుకున్నారు. పేదవాడికి ఓ డబుల్ ఇల్లుకు నానా తంటాలు పడ్డా, తమకు మాత్రం రాజప్రసాదాలు కావాలని భావించారు. ఇంతగా డబ్బును వినియోగించి, ప్రజల చెమటను విలాసాలకు ఉపయోగించేశారు. కరిమింగిన వెలగపండులా ఇప్పుడు పరిస్థితి అంతా డొల్లగా మారింది. ఇద్దరూ అధికారం కోల్పోయారు. కొంత వ్యవధి తేడాల ఇద్దరూ విపక్షం లోకి వచ్చారు. ఇప్పుడు కూడా ఈ ఇద్దరి మనస్తత్వం, కార్యక్రమాలు ఒకేరీతిన ఉన్నాయి. మొగుడిని కొట్టి మొగసాలకు ఎక్కిందన్న సామెతలా..చేసిన తప్పులన్నీ చేసినానాయాగీ చేస్తున్నారు. ఎపిలో జగన్ అక్కడంతా అక్రమాలు, అహింస రాజ్యమేలుతున్నాయని గగ్గోలు పెడుతున్నారు. 40 రోజుల్లోనే ఏదో జరిగినట్లు నల్లగుడ్డలు కప్పుకుని మొక్కుబడిగా అసెంబ్లీకి రావడం,పోలీస్ అధికారులపై జులుం ప్రదర్శించ డం కూడా జరిగిపోయాయి. తనకు విపక్ష హోదా ఇవ్వడానికి భయపడుతున్నారని కూడా ఓ రాయి విసిరారు. అధికారంలో ఉన్నా, లేకున్నా హుందాతనం ప్రదర్శించడంలో అటు కెసిఆర్, ఇటు జగన్ ఇద్దరూ విఫలం అయ్యారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో అధికార మార్పిడి జరిగిన తర్వాత అప్పట్లో పరిస్థితులు ఎలా ఉండేవో ఇప్పుడు ఎలా ఉన్నాయో ప్రజలకు అర్థం అవుతోంది. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఇంతగా ఎందుకు దిగజారిపోయారా అని అనుమానం కలుగుతోంది. ఎపిలో జగన్ అధికారంలో ఉండగా ఒక రకమైన భయానక వాతావరణం ఉండింది. బయటకు విమర్శలు చేస్తే....యూ ట్యూబర్లపైనా కేసులు పెట్టి వేధించిన ఘటనలు చూశాం. ప్రజలంతా భయం గుప్పిట్లో బతికారు. జగన్‌తో పాటు ఆయన కోటరీలో ఉన్న వారి వల్ల అధికార యంత్రాంగం చేష్టలుడిగి చూసింది. తెలంగాణలో కూడా అధికార వ్యవస్థ భ్రష్టుపట్టి పోయింది. ఫోన్ ట్యాపింగ్‌తో ప్రత్యర్థుల ఫోన్లను ట్యాప్ చేశారు. అధికార దుర్వినియోగం విపరీతంగా సాగింది. ప్రగతి భవన్ పేరిట ప్యాలెస్‌ను పోలిన భవనాన్ని నిర్మింపజేసి అందులో నుంచి కాలు బయటపెట్టకుండా కనుసైగలతో రాష్ట్రాన్ని పాలించిన కేసీఆర్‌కు తెలంగాణ ప్రజలు తగిన గుణపాఠం చెప్పారు. అయినా ఆయనతో పాటు కొడుకు, అల్లుడి తీరులో మార్పు కనిపించడం లేదు. పాశ్చాత్తాపం కానరావడం లేదు. బటన్లు నొక్కడం వల్ల మళ్లీ అధికారంలోకి వస్తామని జగన్ నమ్మి అడ్డగోలు పనులు చేశారు. అందుకే జగన్‌ను జనం కసిగా ఓడించినా.. కారణాలు తెలుసుకోలేక పోతున్నారు. ఆత్మ విమర్శల చేసుకోవడం లేదు. రోడ్డెక్కి నానా హంగామా చేయాలని చూస్తున్నారు. అందుకే ప్రజలతో పాటు, అణచివేతకు గురైన నేతలు తమకు ఎదురైన అనుభవాలను గుర్తుచేసుకుంటూ పగ తీర్చుకోవాలని రగిలిపోతున్నారు. ఇప్పుడు ఘోర పరాజయం పాలయ్యాక కూడా గుణపాఠం నేర్చుకోకుండా నోటికి పని చెబుతున్నారు. ఈ క్రమంలోనే అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న వేళ ఢిల్లీలో ధర్నాకు దిగడానికి వెళ్లారు. పల్నాడులో జరిగిన ఓ వ్యక్తిగత హత్యను తనకు అనుకూలంగా మార్చుకోవాలని చేస్తున్న ప్రయత్నంతో ప్రజల్లో భంగపడ్డారు. ఈ హత్యపై గగ్గోలు పెడుతున్న జగన్ సొంత చిన్నాన్న హత్యను పట్టించుకోవడం లేదు. విచారణకు అడుగడు గునా అడ్డు పడ్డారు. వివేకానంద రెడ్డిని హత్య చేయించిన వారిని ముఖ్యమంత్రిగా జగన్ రక్షించారని ప్రజలు నమ్ముతున్నారు. సొంత చెల్లెళ్లు వైఎస్ షర్మిల, డాక్టర్ సునీతలు చేస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పడం లేదు. అందుకే ఆయన సొంత జిల్లా కడపలో కూడా మూడే స్థానాలు వచ్చాయి. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వంటి వారు కూడా చావుతప్పి కన్ను లొట్టబోయిన చందంగా ఆరేడు వేల స్వల్ప మెజారిటీ తో గెలిచారు. ఇంత జరిగినా జగన్ వైఖరిలో మార్పు రాకపోవడం ఆశ్చర్యంగా ఉంది. రాజకీయం గా వేసిన తప్పటడుగులను సరిచేసుకోవాలన్న ధ్యాస కానరావడం లేదు. ఇది కెసిఆర్ విషయంలోనూ వర్తిస్తుంది. చేసిన తప్పులను పక్కన పెట్టి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తూర్పార పట్టే పనిలో పడ్డారు. శాసనసభ్యుడిగా ప్రమాణస్వీకారం చేసిన జగన్ సభా కార్యక్రమాల్లో పాల్గొనకుండా నియంతలా వ్యవహరి స్తున్నారు. సభకు హాజరయ్యే విషయంలో కెసిఆర్, జగన్‌ల తీరు ఒకేలా ఉంది. తాము ఇద్దరమూ శాశ్వతంగా అధికారంలో ఉంటామని కలలు కన్నారు. అందుకే ప్యాలెస్‌లు కట్టుకున్నారు. ప్రజల ధనంతో విలాసాలు అనుభవించారు. సమాజంలో కళ్ళెదురుగా హత్యలు చేసిన, చేయించిన ఘటనలు చూశాం. ప్రభుత్వ వ్యతిరేకత ఆధారంగా నే ఇటీవలి కాలంలో ప్రజలు తీర్పు ఇస్తున్నారనడానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రజలు ఇచ్చిన తీర్పు నిదర్శనంగ ఆచూడాలి. అలాగే ఏకపక్షంగా వెళ్లిన మోడీకి కూడా ఓటమి ఎలా ఉంటుందో రుచి చూపారు. గత ఐదేళ్ల పాలనా అనుభవాలను దృష్టిలో పెట్టుకొని కెసిఆర్, జగన్‌లు తమ విధానాలు మార్చుకోవాలి. పాశ్చాత్తాపం ప్రకటించాలి. చేసిన తప్పులకు పడే శిక్షలకు సిద్దంగా ఉండాలి. అధికారంలో ఉండగా చేసిన తప్పులకు శిక్షలు పడాలి. అవి త్వరగా నిర్ధారణ కావాలి. లోక్‌పాల్ వంటి వ్యవస్థను ఏర్పాటు చేస్తేనే పాలకుల అవినీతిని అరికట్టగలం. వ్యవస్థను గాడిలో పెట్టుకోగలం.

## జిజిహెచ్ ను సందర్శించిన ప్రత్యేక కేంద్ర బృందం ....

నిజామాబాద్ ,జులై 23(లోకంతీరు):ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కేంద్ర ప్రత్యేక బృందం సందర్శించారు.బుదవారం జిజిహెచ్ నిజామాబాద్ లో జరిగిన మీడియా సమావేశంలో డాక్టర్ ప్రతిమ రాజ్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ న్యూఢిల్లీ నుండి ప్రభుత్వ ఆసుపత్రులలో " గాలి ద్వారా సంక్రమించే వ్యాధుల నియంత్రణ" బృందం వచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రతిమ రాజ్ మాట్లాడుతూ .. గాలి ద్వారా సంక్రమించే వ్యాధులలో ప్రధానంగా క్షయ(టి.బి) ముఖ్యమైనదని, ఇది దగ్గు, జలుబు ద్వారా మాత్రమే కాకుండా అంతర్గత అవయవాల తీవ్రతను బట్టి రావచ్చునని అలాగే రాత్రిపూట చెమటలు, జ్వరం, దీర్ఘకాలిక దగ్గు, ఆకలి మందగించడం, నిద్రలేమి, బరువు తగ్గడం ఇలాంటి లక్షణాలను కలిగి ఉన్నప్పుడు కూడా క్షయవ్యాధి రావచ్చునని అలాంటి సందర్భంలో పరీక్షలు చేయించుకొని నిర్ధారణ చేసుకోవాలని తెలియజేశారు. అంతేకాకుండా క్షయ వ్యాధి ఉన్నవారిలో డ్రగ్ రెసిస్టెన్సీ కారణంగా మళ్లీ పునరావృతం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందకుండా వీటన్నింటికీ ఆసుపత్రిలో చికిత్స ఉంటుందని ప్రజలు సరైన అవగాహనతో చికిత్సను చేయించుకోగలరని తెలిపారు. కేంద్రం నుంచి వచ్చిన డాక్టర్ పార్థసారథి గారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 185 క్షయ వ్యాధి నిర్మూలన కేంద్రాలలో నిజామాబాద్ ఒకటని, అందుకే ఇక్కడికి రావడం జరిగిందని తెలిపారు. నిజామాబాద్ జి జి హెచ్ లో క్షయ వ్యాధి



నిర్మూలన పై తగిన చర్యల పైన సమీక్ష నిర్వహించామని తెలిపారు మరియు డాక్టర్ ప్రతిమ రాజ్ గారు అన్ని రకాల నియంత్రణ చర్యలను పాటిస్తున్నట్లు , ముఖ్యంగా సిబ్బందికి వ్యాక్సినేషన్ ఏర్పాటు చేయడం, ప్రతి వారం (హాస్పిటల్ ఇన్ఫెక్షన్ కంట్రోల్ కమిటీ) ద్వారా సమీక్షలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. జిజిహెచ్ కి విచ్చేస్తున్న రోగులకు క్షయ(టి.బి)



పై అవగాహన కల్పించే విధంగా సూచనలను ఏర్పాటు చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు డాక్టర్ పార్థసారథి, డాక్టర్ భరత్ కుమార్, ప్రమోద్ రెడ్డి మరియు జిజిహెచ్ ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

## సిరికొండలో కలెక్టర్ విస్తృత తనిఖీలు పాఠశాలలు, పీ.హెచ్.సీ పనితీరు పరిశీలన

నిజామాబాద్, జూలై 23 (లోకంతీరు): మారుమూల ప్రాంతమైన సిరికొండ మండలంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మంగళవారం పర్యటించి విస్తృత తనిఖీలు చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రజా పాలన సేవా కేంద్రం, గిరిజన ఆశ్రమ పాఠశాల తదితర వాటిని ఆకస్మికంగా సందర్శించి వాటి పనితీరును నిశితంగా పరిశీలన జరిపారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆశ్రమ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, ఉర్దూ మీడియం పాఠశాలలను, వాల్గోట్ కలాన్ గ్రామంలోని జెడ్పి హైస్కూల్ లను కలెక్టర్ తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను పరిశీలించారు. తాగు నీటి వసతి, కిచెన్ షెడ్, క్లాస్ రూమ్స్, వరండా తదితర వాటిని పరిశీలించిన కలెక్టర్, పనులు పూర్తయిన వాటికి తక్షణమే ఎం.బీ రికార్డు చేయాలని అధికారులను ఆదేశించారు. తుది దశలో ఉన్న పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, వేగవంతంగా పూర్తి చేయించాలని అన్నారు. విద్యార్థుల సంఖ్యను అడిగి తెలుసుకున్న కలెక్టర్, ఉపాధ్యాయుల హాజరు గురించి వాకబు చేశారు. తరగతి గదులను సందర్శించి, విద్యార్థులకు అందిస్తున్న బోధనా తీరును పరిశీలించారు. డిజిటల్ విధానంలో కొనసాగుతున్న విద్యా బోధనతో పాఠాలు సులభతరంగా ఆకళింపు చేసుకోగల్గుతున్నామని విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ముఖ్యంగా గణితం, సామాన్య శాస్త్రం పాఠ్యంశాలు సులభంగా అర్థమయ్యేందుకు డిజిటల్ క్లాస్ రూమ్ ఉపకరిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా పలువురు విద్యార్థులు నోట్ బుక్స్ చెక్ చేసి, వారికి అందిస్తున్న బోధన తీరును గమనించారు. వార్షిక పరీక్షల్లో అందరూ 10 జీపీఏ సాధించాలని పదవ తరగతి విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వ బడులలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే కాకుండా విద్యార్థులకు ఉచితంగా ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు అందించడం జరుగుతోందని గుర్తు చేశారు. ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలని, ఏకాగ్రతతో చక్కగా చదువుకుని తల్లిదండ్రులు, పాఠశాలకు మంచి పేరు తేవాలని విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. ఏవైనా సందేహాలు ఉంటే ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. గణితం సబ్జెక్టు పట్ల అనవసర భయాన్ని వీడాలని, నిజానికి ఇతర సబ్జెక్టుల కంటే గణితమే సులభమని హితబోధ చేశారు. గణితంలో పట్టు సాధిస్తే, టెన్త్ తరువాత ఇంటర్, డిగ్రీ వంటి వాటిలోనూ రాణించేందుకు ఇది ఎంతగానో ఉపకరిస్తుందని కలెక్టర్








విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. కాగా, సిరికొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవల తీరును పరిశీలించారు. రిజిస్ట్రేషన్ కౌంటర్, అవుట్ పేషంట్, ఇన్-పేషంట్ విభాగాలు, వివిధ వార్డులను సందర్శించారు. మధుమేహం, రక్తపరీక్షలు చేస్తున్న తీరును పరిశీలించి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు సగటున ఎంతమంది రోగులు వస్తారు, ఎంతమంది ఇన్ పేషంట్లుగా చేరుతున్నారు, మందులు అందుబాటులో ఉన్నాయా అని ఆరా తీశారు. వర్షాకాలం అయినందున సీజనల్ వ్యాధులకు సంబంధించిన అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించేలా కట్టుదిట్టమైన పర్యవేక్షణ జరపాలని వైద్యారోగ్య



శాఖ అధికారిని ఆదేశించారు. వైద్యుల కొరత ఉన్న చోట కాంట్రాక్టు పద్ధతిన డాక్టర్ల నియామకానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. రెసిడెన్షియల్ స్కూల్స్, గురుకులాలు, వసతి గృహాలను కనీసం వారానికి ఒకసారైనా వైద్యులు సందర్శించి విద్యార్థులతో పాటు బోధన, బోధనేతర సిబ్బందికి సైతం ఆరోగ్య పరీక్షలు జరపాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కలెక్టర్ ఎంపిడిఓ కార్యాలయంలో కొనసాగుతున్న ప్రజాపాలన సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించి, విద్యార్థులకు సమకూర్చిన సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో అధికారులతో కలిసి మొక్కలు నాటారు. కలెక్టర్ వెంట డీఆర్డీఓ సాయాగౌడ్, మండల ప్రత్యేక అధికారి నాగురావ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారం, పంచాయతీరాజ్ ఈ ఈ శంకర్ నాయక్, ఎంపీడీవో లక్ష్మీప్రసాద్, తాసిల్దార్ రవీందర్రావు తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వం మాఫీ చేసిన రుణం డబ్బులు రైతులకు అందరికి

### అందాలి- మాజీ జెడ్పీటీసి పడిగెల రాజేశ్వరరావు




కామారెడ్డి జిల్లా , జూలై 23 ( లోకంతీరు ) : కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి లో గల గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ యజమాన్యం రైతుల పేరిట బ్యాంకుల్లో తీసుకున్న డబ్బులు మాఫీ కావడంతో ఆ డబ్బులు రైతులకే ఇవ్వాలని మాజీ జెడ్పిటిసి బారాస సీనియర్ నాయకుడు పడిగెల రాజేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం తమ రుణమాఫీ అయిందని గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ యజమాన్యం తమకు తెలియకుండానే మా పేర్లపై రుణం తీసుకుందని రుణమాఫీ అయినట్టు తమకు సమాచారం వచ్చిందని వెంటనే డబ్బులను తమకే ఇప్పించాలని అడ్లూరు ఎల్లారెడ్డి, పోసానిపేట్, సదాశివనగర్, మర్కల్, కుప్రియాల్ గ్రామాల రైతులు రాజేశ్వరావు ను కోరారు.ఈ విషయంపై స్పందించిన మాజీ జెడ్పిటిసి న్యాయంగా రైతులకు చెందవలసిన డబ్బులు యజమాన్యం ఎలాంటి సమాచారం ఇవ్వకుండా రైతులను మోసం చేయడానికి ప్రయత్నిస్తుందని ఆరోపించారు. వందలాది మంది రైతుల పేరిట ఫ్యాక్టరీ యాజమాన్యం రుణాలు తీసుకున్నట్టు తెలుస్తుందన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నాందేవ్ వాడ యూనియన్ బ్యాంకు లో రైతుల పేరిట ఋణం పొందినట్లు సమాచారం వచ్చిందని మాజీ జెడ్పిటిసి తెలిపారు. ఫ్యాక్టరీ యజమాన్యం వెంటనే మాఫీ అయిన డబ్బులను రైతులకు చెక్కుల ద్వారా అందజేయాలని ఆయన యాజమాన్యాన్ని కోరారు. యాజమాన్యం ఆందోళన చేయవలసి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో రైతు నాయకుడు కళాలి సాయ గౌడ్, భారాస సీనియర్ నాయకుడు లింబాద్రి నాయక్, అడ్లూరు ఎల్లారెడ్డి గ్రామ టిఆర్ఎస్ అధ్యక్షుడు ఆశ మహేష్, రైతులు కుమ్మరి రాజలింగం, సంజీవరెడ్డి, నవీన్ రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కొన్ని మెరుపులు..మరికొన్ని విరుపులు..

మెదటిపేజీ తరువాయి...

ఉత్పత్తి కోసం ఒక వ్యూహాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. రైతుల ఆదాయం పెంచడం, వ్యవసాయ విలువను పెంచడం దిశగా ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల మద్దతుతో పంట అనంతర కార్యకలాపాలలో పెట్టుబడులను ప్రోత్సహించడం, పాడి రైతులకు సాధికారత, నానో-డిఎపిని అన్ని వ్యవసాయ-వాతావరణ మండలాలకు విస్తరించడం, 5 ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్కుల ఏర్పాటు, ఆక్వాకల్చర్‌ను ప్రోత్సహించడానికి బ్లూ ఎకానమీ 2.0 ప్రారంభం, ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన అమలును వేగవంతం చేయడం, 11.8 కోట్ల మంది రైతులకు ప్రత్యక్ష ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు కేంద్ర ఆర్థిక మంత్రి. చిన్న రైతును దృష్టిలో ఉంచుకుని ఆధునిక వ్యవసాయ సాంకేతికతలను ప్రోత్సహించడంపై దృష్టి పెట్టారు. చిరు ధాన్యాలను పండించడం, స్టార్టప్‌లను ప్రోత్సహించడంపైనా ఫోకస్ పెట్టింది.భారతదేశ వ్యవసాయ రంగం వారసత్వ సమస్యలలో కొట్టుమిట్టాడు తూనే ఉంది. ఇప్పటికీ దేశ జనాభాలో అధిక శాతం మంది ప్రజలు దీనిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. అయినప్పటికీ, వ్యవసాయం సమర్థత లోపించి తక్కువ ఆదాయ వృత్తిగా మిగిలిపోయింది. వ్యవసాయ ఉపాధి అవకాశాలను సృష్టించడంతోపాటు వాణిజ్యీకరణ, వైవిధ్యీకరణ దిశగా పయనించాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు. మధ్యతరగతి ప్రజలుపై ప్రధానంగా ఫోకస్ చేయడం జరిగిందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. దేశ వ్యాప్తంగా 4.1 కోట్ల మంది యువతీ, యువకులకు లబ్ది చేకూర్చేందుకు ప్రభుత్వం ఈ రంగాలపై దృష్టి సారిస్తుందని సీతారామన్ చెప్పారు. ఈ రంగాలలో పథకాలు, చర్యలు - ప్రస్తుతం ఉన్నవి, ప్రకటించబోయేవి అన్నింటికి కలిపి ఐదు సంవత్సరాల వ్యవధిలో రూ. 2 లక్షల కోట్ల నిధులను ఖర్చు చేయనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటించారు. ÷ానున్న ఐదేళ్లలో 20 లక్షలమందికి నైపుణ్యాభివృద్ధి సంస్థల ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటించారు. నైపుణ్యాభివృద్ధి కేంద్రాలకు అవసరమైన రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. భారతీయ విద్యాసంస్థల్లో చదువుకునే విద్యార్థులకు 3 శాతం వడ్డీ రాయితీ కల్పిస్తామన్నారు. స్వయం ఉపాధి పొందుతున్న చేతివృత్తి మహిళలకు రుణ సాయం పెంచుతున్నట్లు ప్రకటించారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధికి ఆర్థిక సాయం అందిస్తామన్నారు. ఎంఎస్ఎంఈ క్లస్టర్లు నూతన సిడ్‌బీ బ్యాంకు బ్రాంచ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. ఎగుమతులు, ఎగుమతుల సేవలకు ప్రత్యేక ప్లాట్‌ఫాం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. 500 పెద్ద కంపెనీల్లో కోటి మంది యువతకు ఉద్యోగాల కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ క్రమంలో బీహార్, ఆంధ్రప్రదేశ్‌లకు ఈ బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించారు. ఈ నేపథ్యంలో బుద్ధగయ, రాజ్‌గిర్, వైశాలి, దర్భంగాలలో రోడ్డు కనెక్టివిటీ ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తామని ఆర్థిక మంత్రి తెలిపారు. బీహార్‌లో వివిధ రహదారుల ప్రాజెక్టుల కోసం రూ.26,000 కోట్లను బడ్జెట్ ప్రతిపాదించింది. బీహార్‌కు బహుపాక్షిక అభివృద్ధి సంస్థల సహాయంతో ఆర్థిక సహాయాన్ని అందజేస్తామని చెప్పారు. బీహార్‌లో విమానాశ్రయాలు, వైద్య కళాశాలలు, క్రీడా మౌలిక సదుపాయాలను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని వెల్లడించారు. బీహార్‌లోని పీర్‌పైంటిలో 2400 మెగావాట్ల కొత్త పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడంతోపాటు విద్యుత్ ప్రాజెక్టులను రూ.21,400 కోట్లతో చేపట్టనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు రూ.15 వేల కోట్ల ఆర్థిక సాయం ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని హామీలను నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. రాష్ట్ర రాజధాని ఆవశ్యకతను గుర్తించి, బహుపాక్షిక ఏజెన్సీల ద్వారా ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని అందిస్తామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ. 15,000 కోట్లు కేటాయించబడతాయన్నారు. పోలవరం నీటిపారుదల ప్రాజెక్టుకు నిధులు సమకూర్చి పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆర్థిక మంత్రి తెలిపారు. ఈ క్రమంలో బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఆంధప్రదేశ్‌ల సర్వతోముఖాభివృద్ధికి కేంద్రం 'పూర్వోదయ' పథకాన్ని కూడా తీసుకురానుంది. తూర్పు ప్రాంతంలో పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి ప్రభుత్వం సహకరిస్తుందని సీతారామన్ చెప్పారు.

## హైదరాబాదులో శిక్షణకు బయలుదేరిన కామారెడ్డి ఉపాధ్యాయులు



కామారెడ్డి జిల్లా , జూలై 23 ( లోకంతీరు ) : నేషనల్ అచీవ్మెంట్ సర్వే లో భాగంగా కామారెడ్డి జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు తెలంగాణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ రాజేంద్రనగర్ శిక్షణ సంస్థలో ఒక రోజు శిక్షణకు బయలుదేరినట్లు ఉపధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 3,6,9 తరగతుల విద్యార్థులలోని అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించడానికి రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందినట్లు వారు తెలిపారు. వీరు త్వరలో జిల్లా స్థాయిలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు డా. వెంకన్నగారి జ్యోతి, జంగం శ్రీశైలం, జక్కుల శ్రీనివాస్, ఏసురత్నం, సురేందర్, రజిని తదితరులు ఉన్నారు.

## తెలంగాణ కు కేంద్ర ప్రభుత్వం ఇచ్చింది జీరో- నేషనల్ కో ఆర్డినేటర్ నీలం రమేష్



కామారెడ్డి జిల్లా , జూలై 23 ( లోకంతీరు ) : భారత రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు ఇచ్చింది గాడిద గుడ్డు అని అల్ ఇండియా కిసాన్ సెల్ నేషనల్ కోఆర్డినేటర్ నీలం రమేష్ మీడియా సమావేశం లో పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అడిగినవి.రూపాయి పంపిస్తే 43 పైసల బిచ్చం నుండి విముక్తి అని,మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు జాతీయ హోదా కల్పించాలని, రాష్ట్రంలో కనీసం ఒక్క ఐఐఎం, ఎన్ ఐ డి విద్యాలయం లేదన్నారు. కాజీపేట లో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ,పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలన్నారు.బడ్జెట్లో ఉత్తరాది రాష్ట్రాలతో సమాన వాటా ఇవ్వాలని,811టీ ఎం సి కృష్ణా జలాలలో సరైన వాటా ఇవ్వాలని,బయ్యారం ఉక్కు ఫ్యాక్టరి, స్మార్ట్ సిటీలుగా వరంగల్, కరీంనగర్ చేయాలన్నారు.


## రుణమాఫీ కాని రైతులకు అవగాహన కల్పించిన- ఏ ఈ ఓ సాయి సచిన్



బాల్కొండ నియోజకవర్గం ప్రతినిధి , జులై 23 ( లోకంతీరు ) : ఎర్గట్ల మండలంలోని బట్టాపూర్ గ్రామ పంచాయితీ లో ఏ ఈ ఓ సాయి సచిన్ లక్ష లోపు రుణాలు మాఫీ కానీ వారి వివరాలు తెలుసుకొని రుణాలు మాఫీ ఎందుకు కాలేదో అన్ లైన్ లో చూసి రైతులకు వివరించారు. పలువురు రైతులకు సంభందించిన వివరాల్లో తప్పులు దొర్లడం తో వివరాలు సరి చేయించుకోవాలని సూచించారు.ఆయన వెంట గ్రామానికి చెందిన దయానంద్,తదితరులు, ఉన్నారు.

## అధికారుల బదిలీలు

బాల్కొండ నియోజకవర్గం ప్రతినిధి , జులై 23 ( లోకంతీరు ) : ముప్కాల్ ఎంపీవో భరత్ చంద్రతో పాటు మరో ముగ్గురు పంచాయతీ సెక్రటరీలు (నల్లూర్, కొత్తపల్లి, రెంజర్ల) బదిలీలపై మరొక చోటికి వెళ్లడం జరిగిందని ఎంపీడీవో మహమ్మద్ ముజాఫరోద్దీన్ మంగళవారం రోజు ఉదయం తెలిపారు.ముప్కాల్ ఎంపీవో భరత్ చంద్ర మెండోరా మండలానికి బదిలీపై వెళ్లగా, ఆయన స్థానంలో రెంజల్ మండలంకు చెందిన ఎంపీవో మహమ్మద్ గౌస్ పదవి బాధ్యతలు స్వీకరించినట్లు పేర్కొన్నారు. కొత్తపల్లి పంచాయతీ సెక్రటరీగా ఎన్. రాజు, నల్లూర్ కె.విఘ్నేష్, రెంజర్ల సెక్రటరీగా టీ.నగేష్ లు పదవీ బాధ్యతలు స్వీకరించారు.




# అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్

## -నేడు ఆయన వర్ధంతి



మానవ జాతి వికాసానికి సృష్టి అందించిన వరప్రసాదమే సర్ ఆర్ధ్ కాటన్. మదరాసు రాష్ట్రంలో వారు అమలు చేసిన నీటి పారుదల పనులు అద్వితీయమైన విజయాలు సాధించాయి. సర్ ఆర్థర్ కాటన్ దూరదృష్టి, సునిశిత మేధాశక్తి అమోఘం, అద్వితీయం. దక్షిణ భారతావనిలో ఎన్నో నీటి పారుదల రూపకల్పన చేసిన అన్న దాత సర్ ఆర్థర్ కాటన్ ను ప్రభుత్వం సముచితంగా అనేక బిరుదులతో సన్మానించింది.1803 మే 15వ తేది కాటన్ జన్మించారు. కుటుంబంలో అందరికంటే తల్లి వ్యక్తిత్వ ప్రభావం ఆయనపై పడింది. కాటన్ చిన్నతనం నుంచి మనో వికాసానికి సాహసానికి, ధైర్యానికి, దీక్షకు మారుపేరు. తల్లి ఇచ్చిన శిక్షణ కాటన్ కి ఎంతో ఉపక రించింది. 15 ఏళ్ళ ప్రాయంలో ఇండియాకు వెళ్ళడానికి స్కాలర్ షిప్ పొందారు. 1819 సంవత్సరానికి ఆర్థర్ కాటన్ జాగ్రత్తగా చదువుకొని మంచి క్రమశిక్షణతో మెలిగి అది స్కాంబి లో చక్కగా విద్యనభ్యసించి ఏ పరీక్షకు హాజరు కాకుండానే రాయల్ ఇంజనీర్ సర్టిఫికేట్ ఆధారంగా ఉ ద్యోగం సంపాదించారు. 1821 లో 18 సంవత్సర ప్రాయంలో ఇండియాలో ఉద్యోగంలో నియమింపబడ్డారు. 1822 సంవత్సరంలో అనేక జిల్లాల్లోని చెరువు మరమత్తు పనులను పర్యవేక్షించే పనిని అప్పగించారు. 1824 సం?? వరకు ఈవిధంగా పనిచేసి మద్రాసు దక్షిణాన కొన్ని మైళ్ళ దూరంతో వున్న మిలిటరీ స్థావరమైన థామస్ మౌంట్ దగ్గర భవనాలు నిర్మించడానికి నియమించబడిరి. ఎనిమిదేళ్ళ సర్వీసు అయిన తర్వాత కెప్టెన్ ర్యాంక్ కు ఎదగారు. ఆయల కృషి వల్ల తంజావూరు జిల్లాలోని అనే నిర్మాణపు పనులు పూర్తి అయి రాష్టంతో సంపన్న జిల్లా గా మారింది.1828 - 29 సం?? లలో అనేక ప్రణాళికలకు రూపకల్పన చేశారు. తరువాత అనారోగ్య కారణాలవల్ల ఇంగ్లాండు తిరిగి వెళ్ళనలసి వచ్చింది. 1832 లో తిరిగి ఉ ద్యోగంలో ప్రవేశించారు. శక్తికి మించిన శ్రమ చేయడం వల్ల తరచు అనారోగ్యానికి గురయ్యేవారు. ఈసారి ఆస్ట్రేలియాకు వెళ్ళవలసి వచ్చింది. అక్కడ వుండగా ఒక ధనవంతుని కుమార్తె ఎలిజబెత్ ని ప్రేమించి వివాహమాడారి. 1841 సం?? లో అక్టోబరు 10వ తేదీన వీరి వివాహం జరిగింది. తరువాత తిరిగి టాస్మోనియా వెళ్ళారు. ఆ సమయంలో రాజమండ్రి జిల్లా పరిస్తితి అద్వాహ్నంగా ఉండేది. గోదావరి తో పారే నీటిని వినియోగించి ఆ భూములను సస్యశ్యామలం చేయటం జరిగింది. అప్పటినుంచీ రాజమండ్రి జిల్లా గోదావరి జిల్లా గా పేరు గాంచింది. గోదావరి నదిపై 12 లక్షల ఎకరాల సాగుకు ఉపయోగపడే ఒక ఆనకట్ట నిర్మించబడింది. ఈ ఆనకట నిర్మాణం ద్వారా ఆయన కన్న కలలు నిజమయ్యాయి. కాల్వలు తరువాత కాల్వలు, పిల్లకాత్వతు, పంట కాల్వలు త్రవ్వడం జరిగింది. 1841 నుండి 45 సం??లు నీటి పారుదల పథకాల అమలుకై ఆయన నిర్విరామ కృషి చేశారు. 1881 వ సం??లో ప్రచురించిన "వీలున్నచోట నీటి పారుదలకు కాల్వలను ఏర్పాటు చేయాలి. వర్షపు నీరు, బావి నీరు, ఇతర విధానాల ద్వారా లభించే నీటి కన్నా భూమిని సారవంతం చేసే ఎరువు గల్గిన నీటుని పొలాలలకు కాల్వుల దారా పారించవచ్చును. "ఒక చోటినుండి ఇంకొక చోటికి ఉత్పత్తులను కారు చౌక ఎగుమతి చేయడానికి నీటి కంటే మరొక ఉత్తమ సాధనం లేదు. ఆ కారణంగా నీటి పారుదల కాల్వలను స్టీమ్ బోట్ లు తిరగడానికి వాలుగా నౌకాయాన సౌకర్యాలు కల్పించారు. ధవళేశ్వరం ఆలకట్ట నిర్మాణంలో సర్ ఆర్థర్ కాటన్ చూపిన ప్రతి భాపాటవాలు నేటికి మరువలేనివి. ఈ బ్యారేజి నిర్మాణం వల్ల గోదావరి డెల్టాలో 13,75,000 టన్నులు, ధాన్యము, 16,38,000 చెరుకు, 34,000 టన్నుల పప్పు ధాన్యము, చిరుధాన్యాలు ఉత్పత్తి అవుతున్నాయి. ఈ వ్యారేజి నిఢిని 3.6. కి.మీ. దేశంతో కెల్ల అతి పెద్దదైల ధవళేశ్వరం బ్యారేజి సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజిగా పిలువ బడుతున్నది. ఇండియాలో పబ్లిక్ వర్క్స్ అనే పుస్తకాన్ని కూడా ఆయన రాసారు. మానవ జాతి మహోదయానికి ఇంజనీరుగా రచయితగా ఆలోచలా పరులుగా శ్రీ కాటన్ చేసిన కృషి చిరస్మరణీయమైంది. ఆయన పేదరిక నిర్మూలనకు కరువు నివారణకు అనేక నీటి పథకాలు అమలు చేసి చరిత్ర ప్రసిద్ధుడైయాడు. ఎన్ని పనులు చేసినా ఆయన సామాన్యుడే. ధర్మాన్ని నిర్వర్తించాడు. అభివృద్ధే ఆయన ఆదర్శం. అందుకే ఆయనను అన్నదాతగా పిలిచేవారు. ప్రజల హృదయాలలో శాశ్విత స్థానాన్ని ఏర్పరచుకొని 1899 జులై 24వ తేది పరమపదించారు.

# డీలర్ల ఖాళీల భర్తీకి చొరవ

## కలెక్టర్‌తో చర్చించిన ఎమ్మెల్యే

కామారెడ్డి,జూలై23 : రేషన్ షాపులకు డీలర్లు లేక పోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం బయోమెట్రిక్ సిస్టమ్ ద్వారా బియ్యం పంపిణీ చేస్తున్నారు. డీలర్‌కూడా బయోమెట్రిక్ పెట్టాలి. ఎవరి పేరిట షాపు ఉందో వారు బయోమెట్రిక్ చేస్తేనే ఆన్‌లైన్ ఓపెన్‌అవుతుంది. ఇన్‌చార్జి ఉన్న గ్రామాలతో పాటు, రెగ్యులర్‌గా ఉన్న గ్రామాల్లో ఒకే వ్యక్తి బయోమెట్రిక్ సిస్టమ్ ద్వారా బియ్యం పంపిణీకి ఆలస్యం అవుతోంది. ఇన్‌చార్జి ఉన్న షాపుల్లో 2, 3 రోజుల్లో బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఈ రోజుల్లో ఎవరైనా లబ్దిదారులు లేక పోతే రేషన్‌తీసుకునే విలులేదు. స్థానికంగా డీలర్ ఉంటే ఉదయం, సాయంత్రం లబ్దిదారులకు బియ్యం పంపిణీ చేస్తారు. ఇటీవల పలు గ్రామాల ప్రజలు స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి ఈ సమస్య తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే రంగంలోకి దిగి ఖాళీల భర్తీకి పూనుకున్నారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లో ఖాళీగా ఉన్న 42 రేషన్ షాపుల్లో డీలర్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. చాలా గ్రామాల్లో ఏళ్ల తరబడి ఈ సమస్య ఉండగా..లబ్దిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇన్‌చార్జి డీలర్లతోనే నెట్టుకొస్తుండగా.. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ను కలిసి సమస్యను పరిష్కరించాలని సూచించారు. దీంతో పౌరసరఫరాల అధికారులతో మాట్లాడిన కలెక్టర్ ఖాళీగా ఉన్న రేషన్ షాపుల వివరాలను తెలుసుకొని వెంటనే భర్తీ చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం 489 మంది డీలర్లు ఉన్నారు. గతంలో నియమాకమయిన డీలర్ చనిపోవటం, కొందరు వివిధ కారణాలతో వదిలేయటం, అక్రమాలకు పాల్పడిన దృష్ట్యా కొందరిని గతంలో తొలగించటంతో ఖాళీలు ఏర్పడ్డాయి. ఖాళీగా ఉన్న గ్రామాల్లో పక్క గ్రామ డీలర్లకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారు. కొన్ని షాపులకు 10 ఏళ్లుగా ఇన్‌చార్జి ఉంటున్నారు. స్థానికులు పలుమార్లు డీలర్ పోస్టులను భర్తీ చేయాలని కోరుతున్నప్పటికీ అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. కామారెడ్డి, ఎల్లారెడ్డి డివిజన్లలో 2 నియోజక వర్గాలు వస్తాయి. ఈ డివిజన్లలో ఖాళీగా ఉన్న 42 షాపుల డీలర్ల భర్తీ కోసం ఆర్డీవోలు నోటిఫికేషన్ జారీ చేశారు. కామారెడ్డి డివిజన్లో 34, ఎల్లారెడ్డి డివిజన్లో 8 షాపులకు నోటిఫికేషన్ ఇచ్చారు. గ్రామాల వారీగా రిజర్వేషన్లను కూడా ప్రకటించారు. భిక్కనూరు మండలంలో 5, దోమకొండలో 2, కామారెడ్డిలో 8, పాల్వంచలో 2, రాజంపేటలో 5, రామారెడ్డిలో 5, సదాశివనగర్‌లో 4, తాడ్వాయిలో 3, ఎల్లారెడ్డిలో 2, లింగంపేటలో 1, నాగిరెడ్డిపేటలో 5 షాపుల భర్తీకి నోటిఫికేషన్? ఇచ్చారు. ఆగస్టు నెలాఖరులోగా భర్తీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. బాన్సువాడ రెవిన్యూ డివిజన్ పరిధిలో ని జుక్కల్, బాన్సువాడలో 47 షాపుల్లో కూడా త్వరలోనే భర్తీ చేయనున్నారు.

# స్వాతంత్ర్యంతో పాటు స్వయం సమృద్ధి

## పోరాటాన్ని కొత్త పుంతలు తొక్కించిన తిలక్

ముంబై,జూలై23( : స్వాతంత్ర పోరాటాన్ని కొత్త పుంతలు తొక్కించిన స్ఫూర్తి ప్రదాత లోకమాన్య బాగంగాధర్ తిలక్.. . 1856, జులై 23 మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లాలో జన్మించారు. గాంధీజీ దృష్టిలో ఆయన 'ఆధునిక భారత నిర్మాత! నెహ్రూకాయన - 'భారత విప్లవ పిత!' అహింసతో మహాత్ముడు బ్రిటిష్ ప్రభుత్వాన్ని గడగడలాడిస్తే... 'ఆలోచన'తో భారతీయులను తట్టిలేపి, తెల్లవారి గుండెల్లో కల్లోలం సృష్టించి... భారతావని నుదిటిన స్వరాజ్య 'హక్కు' తిలకం దిద్దిన బుద్ధిజీవి... బాల గంగాధర్ తిలక్! మనం ఈరోజు వింటున్న ఆత్మనిర్భర్, మేకిన్ ఇండియాను వందేళ్ల కిందటే ఆకాంక్షించిన ఆ దార్శనికుడి జయంతి నేడు! అలనాటి పోరాట యోధుడికి ఓ నివాళి!ఒక్కటి కాదు... ఆయనో తత్వవేత్త, గణితవేత్త, జర్నలిస్టు, రచయిత.. ఉద్యమకారుడు. తిలక్ దృష్టిలో స్వరాజ్యమంటే కేవలం రాజకీయ స్వాతంత్ర్యం ఒక్కటే కాదు. సాంస్కృతిక, ఆర్థిక స్వాతంత్ర్యం కూడా! సంస్కృతి, విద్య, మీడియా... మూడింటినీ మార్గాలుగా చేసుకొని ప్రజల్ని చైతన్యవంతులను చేయటానికి, భారత జాతీయ అస్థిత్వాన్ని పాదుకొల్ప టానికి కృషి చేశారు తిలక్. ఆత్మనిర్భర్ భారత్... నైపుణ్య భారత్, మేకిన్ ఇండియా...అంటూ ఇప్పుడు మనం ప్రతిరోజూ వినే ఈ పదాల్ని వందేళ్ళ కిందటే మంత్రించారు తిలక్! తన స్వదేశీ అర్థం కేవలం విదేశీ వస్తువులను బాయ్‌కాట్ చేయటమే కాదు... దేశీయంగా మనవాళ్ళు పారిశ్రామికవేత్తలుగా మారాలని, భారత్‌లో తయారీ రంగం విస్తరించాలని కోరుకునేవారు. ఆయనిచ్చిన ఈ స్ఫూర్తితోనే ఈశ్వర్‌దాస్ వర్ష్ణెళి పుణె దగ్గర గ్లాస్‌వర్క్స్ ఫ్యాక్టరీ ఆరంభించారు. ముంబైలో జంషెడ్‌జీ టాటాతో కలసి తిలక్ బొంబాయి స్వదేశీ సహకార స్టోర్స్ కంపెనీ మొదలెట్టారు. భారత్‌లో తయారయ్యే వస్తువులను ప్రోత్సహించటం ఈ కంపెనీ ప్రధాన కర్తవ్యం. ట్యుటికోరిన్‌లో చిదంబరం పిళ్ళై షిప్పింగ్ కంపెనీ తెరిచారు. బ్రిటిష్ ఇండియా స్టీమ్ నావిగేషన్ కంపెనీకి అది తీవ్రమైన పోటీనిచ్చింది. చివరకు... మాండలే జైలులో ఉన్నప్పుడు రాసిన గీతారహస్య పుస్తకం అచ్చువేసేందుకు భారత్‌లో తయారైన కాగితాన్నే వాడాలని పట్టుబట్టారు. స్వాతంత్ర్యోద్యమంలో ఆయన వినాయక ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించి స్వాతంత్ర్యోద్యమ కాంక్షను రగిలించారు.

# గృహ నిర్మాణాలకు ప్రోత్సాహం

## 10లక్షల కోట్లతో కోటిమందికి ప్రయోజనం

## ముద్రా రుణాల పరిమితిని పెంచుతూ నిర్ణయం

న్యూఢిల్లీ,జూలై23 సొంతింటి కల నెరవేర్చుకోవాలనుకునే పట్టణ పేదలు, మధ్యతరగతి జీవులకు బడ్జెట్ 2024-25లో కేంద్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. 'ప్రధానమంత్రి ఆవాస్ యోజన-అర్బన్ 2.0' పథకం కింద ఏకంగా కోటి మందికి గృహ రుణాలు ఇవ్వనున్నట్టు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. మొత్తం రూ.10 లక్షల కోట్ల పెట్టుబడితో 1 కోటి పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఈ ప్రయోజనాన్ని అందించనున్నట్టు వివరించారు. పట్టణ ప్రజల గృహ అవసరాలను గుర్తించామని, ఈ మేరకు అర్బన్ హౌసింగ్ ద్వారా సమస్యను పరిష్కరించనున్నట్టు వివరించారు. ఈ పథకం కింద రానున్న ఐదు సంవత్సరాల్లో మరో రూ. 2.2 లక్షల కోట్లు కేంద్ర సాయం అందుతుందని ఆమె చెప్పారు.మరోవైపు ముద్ర పథకం కింద రుణ పరిమితిని కూడా పెంచుతున్నట్టు సీతారామన్ ప్రకటించారు. అంతేకాకుండా చిన్న, సూక్ష్మ తరహా పరిశ్రమలు మరింత సులభంగా ఆర్థిక సాయాన్ని పొందేలా మార్గదర్శకాలు రూపొందిస్తామని సీతారామన్ స్పష్టం చేశారు.

# బడ్జెట్ లో పెరిగేవి... తగ్గేవి ఇవే

న్యూఢిల్లీ, జూలై 23ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం 2024-25 కోసం కేంద్ర బడ్జెట్‌ను సమర్పించారు. సామాన్యులకు వివిధ వస్తువుల ధరలను ప్రభావితం చేసే విధానాలను ప్రకటించారు. 2024-25 బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం వైద్యరంగానికి సంబంధించి 3 రకాల క్యాన్సర్ మందులపై కస్టమ్స్ డ్యూటీని పూర్తిగా తొలగించింది. ఎక్స్‌రే పరికరాలపై సైతం పన్ను తగ్గించారు.మొబైల్ ఫోన్లు, పరికరాలపై బేసిక్ కస్టమ్స్ డ్యూటీని 15 శాతానికి తగ్గించారు. పారిశ్రామిక అభివృద్ధికి ఊతమిచ్చే చర్యలలో భాగంగా 25 రకాల కీలక ఖనిజాలపై కస్టమ్స్ డ్యూటీని ప్రభుత్వం తగ్గించింది. మెరైన్ ఉత్పత్తుల ప్రోత్సాహం కోసం రొయ్యలు, చేపల ఫీడ్‌పై బేసిక్ కస్టమ్స్ డ్యూటీ 5శాతానికి తగ్గించారు. బంగారం, వెండి, ప్లాటినంపై కస్టమ్స్ డ్యూటీ తగ్గించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వినియోగం తగ్గించేందుకు పాస్టిక్ దిగుమతులపై బడ్జెట్లో అదనంగా పన్ను పెంచారు. గ్రీన్ మొబిలిటీని ప్రోత్సహించే చర్యల్లో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాలపై పన్ను తగ్గించారు. పౌర విమానయాన రంగంలో వేగవంతమైన అభివృద్ధి చర్యలలో భాగంగా విమాన టికెట్ల ధరలపై పన్ను తగ్గించారు. సామాన్యులపై పన్నుల భారం తగ్గిందని మరింత సరళంగా, హేతుబద్ధంగా ఊుని మార్చుతామని నిర్మల సీతారామన్ బడ్జెట్‌లో ప్రకటించారు. జీఎస్టీ పన్ను విధానాన్ని మరింత సులభతరం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని సీతారామన్ చెప్పారు.మునుపటి సంవత్సరం బడ్జెట్ సెషన్‌లో, టీవీలు, స్మార్ట్‌ఫోన్‌లు, కంప్రెస్డ్ గ్యాస్, రొయ్యల ఫీడ్, వజ్రాలు వంటి వస్తువుల ధరలు తగ్గించబడ్డాయి. సిగరెట్లు, విమాన ప్రయాణం, వస్త్రాల ఖర్చులు పెరిగాయి. తాజా బడ్జెట్‌లో చౌక, ఖరీదైన వస్తువుల పూర్తి జాబితా దిగువన ఉంది:

చౌకగా మారిన వస్తువులు:

?మొబైల్ ఫోన్లు, మొబైల్ పీసీడీఏ, మొబైల్ ఛార్జర్లపై విధించే బేసిక్ కస్టమ్స్ డ్యూటీ 15 శాతానికి తగ్గింపు

బంగారం, వెండిపై కస్టమ్స్ సుంకం 6%కి, ప్లాటినంపై 6.4%కి తగ్గింపు

క్యాన్సర్ రోగుల మందులపై సుంకం ఎత్తివేత

ఫెర్రో నికిల్, బ్లిస్టర్ కాపర్‌పై ప్రాథమిక కస్టమ్స్ డ్యూటీ తొలగింపు

చౌకగా లభించనున్న లెదర్ వస్తువులు, సీఫుడ్

సోలార్ ప్యానెళ్ల తయారీలో ఉపయోగించే మినహాయింపు పొందిన మూలధన వస్తువుల జాబితాను విస్తరించాలని ప్రభుత్వ ప్రతిపాదన

ఫోన్‌లు, ఎలక్ట్రిక్ వాహనాలకు అవసరమైన లిథియం-అయాన్ బ్యాటరీలపై పన్ను రేటును కూడా తగ్గింపు

25 కీలక ఖనిజాలపై కూడా కస్టమ్స్ సుంకం మినహాయింపు

రొయ్యల, చేపల మేతపై, బ్రూడ్ స్టాక్స్పై బేసిక్ కస్టమ్స్ డ్యూటీ 5 శాతం తగ్గింపు

# బిఆర్‌ఎస్ ఎంపిలు బిజెపిలో చేరడం ఖాయమేనా?

## మరోమారు ఊపందుకున్న ప్రచారం

న్యూఢిల్లీ,జూలై23 తెలంగాణ సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన బీఆర్‌ఎస్ పార్టీకి వరుస ఎదురుదెబ్బలు తగులుతూనే ఉన్నాయి. పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కాంగ్రెస్‌లో చేరిపోయారు. వీరిపై స్పీకర్‌కు, గవర్నర్‌కు ఫిర్యాదు చేసినా లాభం కనిపించడం లేదు. గతంలో టిఆర్‌ఎస్ చేసిన పనినే ఇప్పుడుఉ కాంగ్రెస్ చేస్తోంది. గతంలో మల్లు భట్టి విక్రమార్కకు విపక్షహోదా లేకుండా చేసి, కాంగ్రెస్ ఎల్పీని విలీనం చేసుకున్నారు. ఇదే నీతిని ఇప్పుడు కాంగ్రెస్ అనుసరిస్తోంది. ఈ క్రమంలో ఇటు రాష్ట్రంలో అటు కేంద్రంలో తగులుతున్న షాక్‌లతో కారు పార్టీ కోలుకోలేని పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్‌లోకి ఇప్పటికే పదిమంది ఎమ్మెల్యేలు జంప్ అవ్వగా.. మరికొందరు క్యూలో ఉన్నారు. ఇక ఒకేసారి ఇంతమంది ఎమ్మెల్సీలు కారు దిగిపోవడం బీఆర్‌ఎస్‌కు ఊహించని పరిణామం. ఇవన్నీ ఒకఎత్తయితే.. మరి కొందరు ఎమ్మెల్యేలు ఒకట్రెండు రోజుల్లో గులాబీ పార్టీకి గుడ్ బై చెబుతారని సమాచారం. పార్టీని ఏదో ఒకటి చేసి గాడిన పెట్టాలని అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు అనుకున్న ప్రతిసారీ వరుస ఎదురుదెబ్బలే తగులుతుండటం గమనార్హం. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్.. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ లను చేర్చుకునే పనిలో ఉంటే అటు కేంద్రంలోని బీజేపీ కూడా ఇదే పనిలో పడింది. రాజ్యసభలో బిజెపికి పెద్దగా బలం లేదు. ఈ క్రమంలో లోక్‌సభ ఎంపీలు లేకపోవడంతో ఉన్న రాజ్యసభ సభ్యులను చేర్చుకునే పనిలో నిమగ్నమైంది. ఈ క్రమంలో బీజేపీలో బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ విలీనం చేయడానికి రంగం సిద్ధమైందని తెలియవచ్చింది. కమలం గూటికి నలుగురు బీఆర్‌ఎస్ రాజ్యసభ సభ్యులు చేరుతున్నట్లు ఢిల్లీ వర్గాలు చెబుతున్నాయి. ఒకట్రెండు రోజుల్లో ఈ విలీన పక్రియ ఉ ంటుందని అంటున్నారు. లోక్‌సభలో బిఆర్‌ఎస్‌కు ఒక్కటంటే ఒక్క స్థానం కూడా లేదు. విలీనంపై ఢిల్లీలో బీజేపీ పెద్దలతో బీఆర్‌ఎస్ కీలక నేతలు, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావులు ఇటీవల ఒప్పందం చేసుకున్నట్లు బీఆర్‌ఎస్‌లో చర్చ జరుగు తోంది. ఒకట్రెండు రోజుల్లో విలీనం జరుగుతుందని సమాచారం. ఈ విలీనం తర్వాత ఎమ్మెల్సీ కవిత తీహార్ జైలు నుంచి బయటికి వచ్చే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. బీఆర్‌ఎస్ నుంచి ప్రస్తుతం రాజ్యసభలో పార్థసారథి రెడ్డి, దామోదర్‌రావు, సురేశ్ రెడ్డి, వద్ధిరాజు రవిచంద్రలు ఎంపీలుగా ఉ న్న సంగతి తెలిసిందే. కాంగ్రెస్ నుంచి కేవలం ఇద్దరు రేణుకా చౌదరి, అనిల్ కుమార్ యాదవ్‌లు మాత్రమే రాజ్యసభ ఎంపీలుగా ఉన్నారు. దీంతో బీఆర్‌ఎస్ ఎంపీలును చేర్చుకోవడానికి మంతనాలు చేస్తున్నట్లు ముందే పసిగట్టిన బీఆర్‌ఎస్.. తమ ఎంపీలను కాంగ్రెస్‌లో చేరకుండా హైకమాండ్ ఎత్తుగడ వేసిందని తెలుస్తోంది. ఇదే జరిగితే బీఆర్‌ఎస్ బలం పార్లమెంటులో జీరో కానుంది. అయితే ఎంపిలను కాంగ్రెస్‌లోకి వెళ్లకుండా బిజెపిలోకి పంపడం ద్వారా రాజకీయంగా లబ్ది పొందాలని చూస్తున్నట్లు సమాచారం. ఢిల్లీలో ప్రాతినిధ్యం లేకపోయినా ఫర్వాలేదన్న ఆలోచనలో బిఆర్‌ఎస్ ఉ న్నట్లు చర్చ సాగుతోంది. కవిత కేసును ముగించాలని చూస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.

# డ్రగ్స్ తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

హైదరాబాద్,జూలై23( బస్సులు, లారీలు, రైళ్ల ద్వారా నగరానికి మత్తు పదార్థాలు తరలించి విక్రయిస్తున్న ఇద్దరిని ఎల్‌బీనగర్ ఎస్‌వోటీ, జవహర్‌నగర్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. ఎస్‌వోటీ డీసీపీ మురళీధర్‌తో కలిసి కేసు వివరాలను సీపీ వెల్లడించారు. రాజస్థాన్ జోథ్‌పూర్‌కు చెందిన పెయింటర్ ఓమా రామ్ అలియాస్ ఓం ప్రకాష్ (35) నల్లమందు, పాపిస్టా పౌడర్ విక్రయించేవాడు. అదే రాష్ట్రానికి చెందిన సన్వాలరామ్ (33) చందానగర్‌లో ఉంటూ రోలింగ్ షట్టర్ల కార్మికుడిగా పనిచేస్తున్నాడు,. ఇద్దరూ కలిసి సులభంగా డబ్బులు సంపాదించే లక్ష్యంతో డ్రగ్స్ వ్యాపారి వికాస్ అలియాస్ ముఖేష్ నుంచి పాపిస్టా పౌడర్, ఎండీఎంఏ కొనుగోలు చేసి నగరంలో విక్రయిస్తున్నారు.

# సినిమా తీరు

## రానా నాయుడు-2.. అదిరిపోయే అప్డేట్




సీనియర్ హీరో వెంకటేష్, టాలీవుడ్ హల్క్ రానా మెయిన్ లీడ్స్ లో రానా నాయుడు వెబ్ సిరీస్ వచ్చిన విషయం తెలిసిందే. ప్రముఖ ఓటీటీ నెట్ ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ అయిన ఆ వెబ్ సిరీస్ ఫుల్ పాపులర్ అయింది. అత్యధిక వ్యూస్ తో బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకుంది. అదే సమయంలో వివాదాల్లో కూడా నిలిచింది. వెంకటేష్, రానా బోల్డ్ కంటెంట్ తో వెబ్ సిరీస్ చేయడంతో కొందరు తెలుగు ప్రేక్షకులు రిసీవ్ చేసుకోలేకపోయారు.అయితే వెబ్ సిరీస్ పై ఎలాంటి కామెంట్లు వచ్చినా వాటిని పట్టించుకోకుండా నెట్ ఫ్లిక్స్ రానా నాయుడు సీక్వెల్ ను అనౌన్స్ చేసింది. తాజాగా రానా నాయుడు -2 అప్డేట్ ను షేర్ చేసింది. షూటింగ్ మొదలుపెట్టినట్లు ప్రకటించింది. షూటింగ్ సెట్స్ ను నుంచి ఓ చిన్న వీడియో క్లిప్ ను రిలీజ్ చేసింది. దీంతో త్వరలోనే రానా నాయుడు -2 సిరీస్ ను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు అర్థమవుతోంది. ఇక మేకర్స్ విడుదల చేసిన వీడియోలో రానా, వెంకటేష్ మధ్య యాక్షన్ సీన్స్ షూటింగ్ జరుగుతున్నట్లు చూపించారు. బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్ కూడా కనిపించారు. ఇప్పుడు ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. సెకండ్ సిరీస్ మరింత ఇంట్రెస్టింగ్ గా ఉంటున్నట్లు తెలుస్తోందని కొందరు నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. రానా నాయుడు 2 సిరీస్ కోసం వెయిట్ చేస్తున్నామని చెబుతున్నారు. అమెరికన్ టీవీ సిరీస్ రే డొనోవన్ కు రీమేక్ గా రానా నాయుడు వెబ్ సిరీస్ రూపొందిన విషయం తెలిసిందే. అందుకోసం కెరీర్ లో తొలిసారి రానా, వెంకటేష్ స్క్రీన్ షేర్ చేసుకున్నారు. తండ్రీ కొడుకులుగా కనిపించారు. ఈ సిరీస్ లో యాక్టింగ్ కు గాను ఇటీవల రానా ఉత్తమ నటుడిగా అవార్డు కూడా అందుకున్నారు. ఎన్నో విమర్శలు వచ్చినా.. సిరీస్ మాత్రం రికార్డు క్రియేట్ చేసింది. గ్లోబల్ స్థాయిలో హైయెస్ట్ వ్యూస్ తో టాప్ లో నిలిచింది.పవర్ ఫుల్ యాక్షన్ అయితే సీజన్-2 గురించి నెట్ ఫ్లిక్స్ టీమ్ ఇటీవల మాట్లాడింది. ఫస్ట్ సీజన్ కు వచ్చిన రెస్పాన్స్ ను దృష్టిలో ఉంచుకుని సీజన్-2 ను తీసుకొస్తామని తెలిపింది. ఎన్నో ట్విస్టులు ఉంటాయని చెప్పింది. మరింత ఫ్యామిలీ డ్రామాను యాడ్ చేస్తున్నట్లు పేర్కొంది. దీంతో రానా నాయుడు సిరీస్ హేటర్స్ సంగతి పక్కన పెడితే.. లవర్స్ మాత్రం మంచి అంచనాలు పెట్టుకున్నారు. మరి సీజన్-2 ఎలాంటి హిట్ అవుతుందో వేచి చూడాలి.

## గుంటూరు రాజీ భలే బిజీబిజీ

ఫెమినా మిస్ ఇండియా 2018 పోటీలలో హర్యానా నుంచి ప్రాతినిధ్యం వహించిన మీనాక్షి చౌదరి కిరీటాన్ని సొంతం చేసుకుంది. అదే ఏడాది మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్ 2018 లో ఇండియా కి ప్రాతినిధ్యం వహించిన ఈ అమ్మడు రన్నపర్ గా నిలిచింది. మిస్ ఇండియా కిరీటం గెలుచుకున్న తర్వాత మీనాక్షి చౌదరి కి బాలీవుడ్ లో ఎంట్రీ ఇచ్చింది. 2021 లో ఇచట వాహనాలు నిలుపరాదు సినిమాతో టాలీవుడ్ లో అడుగు పెట్టింది. మొదటి సినిమాతో నిరాశ పరిచిన కూడా ప్రముఖుల దృష్టిలో పడటంలో సఫలం అయింది. ముఖ్యంగా స్టార్ దర్శకుడు త్రివిక్రమ్ ఈమెకి ఆఫర్ ఇస్తానంటూ గతంలో ప్రకటించాడు. అన్నట్లుగానే గుంటూరు కారం సినిమాలో రాజీ పాత్రను ఇచ్చాడు. గుంటూరు కారం సినిమాలో ప్రాముఖ్యత లేని పాత్ర అంటూ కొందరు విమర్శించినా కూడా దాని వల్ల వచ్చిన పాపులారిటీ కారణంగా వరుసగా సినిమాలకు కమిట్ అవుతోంది. ఇప్పటికే ఈ అమ్మడు తెలుగు లో మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న విశ్వంభర సినిమాలో కీలక పాత్రలో నటిస్తున్న విషయం తెల్సిందే. చిరు మూవీ కాకుండా విశ్వక్‌సేన్ హీరోగా రూపొందుతున్న మెకానిక్ రాకీ, వరుణ్ తేజ్ హీరోగా నటిస్తున్న మట్కా సినిమాలను చేస్తుంది. అన్నింటి కంటే ముఖ్యంగా తమిళ సూపర్ స్టార్ విజయ్ హీరోగా నటిస్తున్న గోట్ సినిమాలో ఈ అమ్మడు హీరోయిన్ గా నటిస్తోంది. ఇవి కాకుండా మరికొన్ని చర్చల దశలో ఉన్నాయి. రాబోయే రెండేళ్ల కాలంలో మీనాక్షి చౌదరి నటించిన పది సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయంటూ సినీ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు కారం నిరాశ పరిచిన గుంటూరు రాజీ మాత్రం భలే బిజీ బిజీ అని ఆమె సన్నిహితులు మాట్లాడుకుంటున్నారు.


## మెగాస్టార్ న్యూ కాంబో.. క్యారెక్టర్ ఇదేనా?




మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం వశిష్ట మల్లిడి దర్శకత్వంలో విశ్వంభర మూవీ చేస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ దశలో ఉంది. భారీ బడ్జెట్ తో సోషియో ఫాంటసీ కథాంశంతో రెడీ అవుతున్న ఈ సినిమాని యూవీ క్రియేషన్స్ నిర్మిస్తోంది. సౌత్ ఇండియన్ స్టార్ హీరోయిన్ త్రిష ఈ చిత్రంలో చిరంజీవికి జోడిగా కనిపించబోతూ ఉండడం విశేషం. మరో 5 మంది అందాల భామలు ఈ మూవీలో కీలక పాత్రలో నటిస్తున్నారంట. మెగాస్టార్ చిరంజీవి సెకండ్ ఇన్నింగ్ లో కమర్షియల్ బౌండరీ నుంచి బయటికి వచ్చి చేయబోతున్న సినిమా ఇదే కావడం విశేషం.దీని తర్వాత కూడా మెగాస్టార్ కాస్త డిఫరెంట్ కథనే ప్రయత్నం చేయబోతున్నారంట. మెగా 157 వర్కింగ్ టైటిల్ తో ఈ సినిమాకి సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ ప్రస్తుతం చెన్నైలో జరుగుతోందని తెలుస్తోంది. మెగాస్టార్ చిరంజీవితో గాడ్ ఫాదర్ సినిమాని చేసిన మోహన్ రాజా దర్శకత్వంలో ఈ చిత్రం ఉండబోతుందంట. బివిఎస్ రవి ఈ మూవీకి కథ అందించినట్లు సమాచారం. అలాగే మెగాస్టార్ కూతురు సుస్మిత కొణిదెల ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో నిర్మించబోతుందని తెలుస్తోంది. ఏడాదిలోనే మూవీ షూటింగ్ ప్రారంభం అయ్యే అవకాశం ఉందంట. ఈ సినిమాలో మెగాస్టార్ చిరంజీవి పెళ్లి అయిన మధ్య వయస్కుడి పాత్రలో కనిపించబోతున్నారని ఇండస్ట్రీ వర్గాలలో వినిపిస్తోంది. అది నిజమైతే కచ్చితంగా ఇది మెగాస్టార్ కెరియర్ లో మరో ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్ అయ్యే అవకాశం ఉంది. అయితే ఈ మూవీ కథాంశం ప్రజెంట్ లో ఉంటుందా లేదంటే పీరియాడిక్ జోనర్ లో పాన్ ఇండియా అప్పీల్ తో ఉండబోతుందా అనేది తెలియాల్సి ఉంది.మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం చేస్తున్న విశ్వంభర మూవీ 2025 సంక్రాంతికి రిలీజ్ కాబోతోంది. ఈ సినిమా సక్సెస్ అయితే చిరంజీవి కథల ఎంపిక కూడా మారే అవకాశాలు ఉన్నాయి. రెగ్యులర్ కమర్షియల్ లైన్ నుంచి బయటికి వచ్చి డిఫరెంట్ కథలను చేసే ఛాన్స్ ఉంది. మోహన్ రాజా మూవీ కాకుండా మెగాస్టార్ చిరంజీవి హరీష్ శంకర్, మరో యంగ్ డైరెక్టర్ కథలకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ప్రచారం నడుస్తోంది.మరి వీటిలో వాస్తవం ఎంత అనేది వచ్చే ఏడాది తెలిసే ఛాన్స్ ఉంది. హరీష్ శంకర్ దర్శకత్వంలో మూవీ అంటే కచ్చితంగా కమర్షియల్ లైన్ లోనే ఉండే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అలాగే డబుల్ ఇస్మార్ట్ మూవీ హిట్ అయితే పూరి దర్శకత్వంలో కూడా మెగాస్టార్ సినిమా చేయొచ్చని టాక్ నడుస్తోంది.

## అందానికే మరో అందం....






## శివంభజే ట్రైలర్ పవర్ ఫుల్ యాక్షన్



ఈ మధ్యకాలంలో టాలీవుడ్ లో దర్శకులు, హీరోలు అందరూ కూడా దైవంతో కనెక్ట్ అయ్యి ఉండే కథలని తెరపై ఆవిష్కరించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. దైవం అనే ఎలిమెంట్ సెంటిమెంట్ గా వర్క్ అవుట్ అవుతోంది. అలాగే కంటెంట్ లో పవర్ ఫుల్ గా ప్రేక్షకులకి గూస్ బాంబ్స్ క్రియేట్ చేసే ఎలివేషన్ తో రిప్రజెంట్ చేయొచ్చు. ప్రేక్షకులు కూడా ఎమోషనల్ గా సూపర్ నేచురల్ కాన్ ఫ్లిక్ట్స్ కి కనెక్ట్ అవుతున్నారు. ఈ దారిలోనే శివుడితో కనెక్ట్ అయ్యి ఉండే కాన్సెప్ట్ తో అశ్విన్ బాబు హీరోగా శివంభజే సినిమా తెరకెక్కింది.అప్సర్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. గంగ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ లో మహేశ్వర్ రెడ్డి మూలి ఈ చిత్రాన్ని నిర్మించారు. భారీ బడ్జెట్ తో యాక్షన్ థ్రిల్లర్ కథాంశంతో శివంభజే మూవీ తెరకెక్కినట్లు తెలుస్తోంది. తాజాగా ఈ మూవీ ట్రైలర్ ని ప్రేక్షకుల ముందుకి తీసుకొచ్చారు. హై వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్, పవర్ ఫుల్ ఇన్వెస్టిగేషన్ క్రైమ్ థ్రిల్లర్ ఎలిమెంట్స్ తో ఈ మూవీ ఉండబోతోందని ట్రైలర్ బట్టి అర్థమవుతోంది.ఈ ట్రైలర్ ఆరంభంలో పాకిస్థాన్ ఇండియాలో ఏదో పెద్ద విధ్వంసానికి కుట్ర చేస్తున్నట్లుగా డైలాగ్స్ తో ప్రెజెంట్ చేశారు. తరువాత హీరో అశ్విన్ బాబుని యాక్షన్ సీక్వెన్స్ తో పరిచయం చేశారు. తరువాత సిటీలో జరిగే మిస్టీరియస్ క్రైమ్స్ మీద పోలీసులు ఇన్వెస్టిగేషన్ స్టార్ట్ చేసినట్లు చూపించారు. ఈ ఇన్వెస్టిగేషన్ జరుగుతూ ఉండగానే అశ్విన్ బాబు మీద ఎవరో ఎటాక్ చేసే విజువల్ వేశారు. తరువాత హీరో తల్లి శివుడిని ప్రార్థించడం. అఘోర క్యారెక్టర్ తో శివశక్తి కథలోకి ఇంటర్ అయినట్లు ఎలివేట్ చేశారు.ఆ పై సిటీలో జరుగుతున్న క్రైమ్స్, వాటి వెనుక ఉన్న మాస్టర్ మైండ్ ఎవరనేది హీరో కనిపెట్టే ప్రయత్నం మొదలుపెడతాడు. ఇందులో భాగంగా పవర్ ఫుల్ యాక్షన్ సీక్వెన్స్, ఫెస్టివల్ బ్యాక్ డ్రాప్ లో ఫైట్ సీన్స్ తో గూస్ బాంబ్స్ క్రియేట్ చేసే బ్యాగ్రౌండ్ మ్యూజిక్ తో ట్రైలర్ ని పవర్ ప్యాక్డ్ గా ప్రెజెంట్ చేశారు. ట్రైలర్ చూస్తుంటే కంటెంట్ తో ఇంటెస్టింగ్ కథని దర్శకుడు అప్సర్ చెప్పినట్లు కనిపిస్తోంది.ప్రేక్షకులకి కనెక్ట్ అయ్యే యాక్షన్ ఎపిసోడ్స్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ కథలో పుష్కలంగా ఉన్నాయని అనిపిస్తోంది. ఈ చిత్రంలో బాలీవుడ్ యాక్టర్ అర్బాజ్ ఖాన్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించాడు. ఆయన పాత్రలో సినిమాలో కీలకంగా ఉండబోతోందని తెలుస్తోంది. అలాగే దిగంగాన సూర్యవంశీ హీరోయిన్ గా నటించింది. మురళీ శర్మ కూడా ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ గా కనిపించాడు. ఈ సినిమాకి వికాస్ బడిస మ్యూజిక్ అందిస్తున్నారు. ఆగష్టు 1న ఈ చిత్రాన్ని గ్రాండ్ గా రిలీజ్ చేయబోతున్నట్లు ట్రైలర్ తో రివీల్ చేశారు. శివంభజే ట్రైలర్ చూస్తుంటే ఈ సారి అశ్విన్ బాబు మంచి సక్సెస్ కొట్టేలా ఉన్నాడని సినీ విశ్లేషకులు అంటున్నారు. నెటిజన్లు నుంచి ట్రైలర్ కి మంచి స్పందన వస్తోంది.


## ఐపీఎల్‌కు రీ ఎంట్రీ ఇవ్వనున్న రాహుల్ ద్రావిడ్



న్యూఢిల్లీ: టీమిండియా మాజీ కోచ్ రాహుల్ ద్రావిడ్ ఇప్పుడు మళ్లీ ఐపీఎల్‌పై కన్నేసినట్లు తెలుస్తోంది. భారత సీనియర్ క్రికెట్ జట్టుకు కోచింగ్ బాధ్యతల నుంచి ఇటీవల తప్పుకున్న రాహుల్ ద్రావిడ్.. ఇప్పుడు ఐపీఎల్‌లో మెంటర్ పాత్ర పోషించేందుకు రెడీ అవుతున్నట్లు తెలిసింది. కోల్‌కతా నైట్ రైడర్స్ ఫ్రాంచైజీతో జత కలిసేందుకు ద్రావిడ్ ఆసక్తిగా ఉన్నట్లు తొలుత వార్తలు వ్యాపించాయి. గంభీర్ స్థానంలో ద్రావిడ్ బాధ్యతలు నిర్వర్తించనున్నట్లు భావించారు. కానీ ఆ జట్టుతో కలిసేందుకు రాహుల్ ద్రావిడ్ ఇంట్రెస్టింగ్‌గా లేనట్లు తెలుస్తోంది. అయితే ద్రావిడ్ ప్రస్తుతం రాజస్థాన్ రాయల్స్ తో చర్చల్లో ఉన్నట్లు న్యూస్ అందుతోంది.నిజానికి టీమిండియా జట్టుకు కోచింగ్ బాధ్యతలు కొనసాగించేందుకు ద్రావిడ్ ఆసక్తిగా లేదు. ఏడాదికి పది నెలలు జట్టుతో గడపాల్సి వస్తున్న కారణంగా అతను హెడ్ కోచ్‌గా కొనసాగేందుకు నిరాకరించాడు. కానీ ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో ఏదైనా ఫ్రాంచైజీతో లింకు కోసం ద్రావిడ్ ప్రయత్నిస్తున్నాడు. ఐపీఎల్ అయితే కేవలం రెండు లేదా మూడు నెలలు సరిపోతుందని ద్రావిడ్ అంచనా వేస్తున్నట్లు తెలుస్తోంది.గతంలోనూ ఐపీఎల్ జట్లకు మెంటర్‌గా, కోచ్‌గా ద్రావిడ్ చేశాడు. ఢిల్లీ డేర్‌డెవిల్స్‌కు కోచ్‌గా చేశాడు. 2017లో ఆ ఫ్రాంచైజీని అతను వదిలేశాడు. ఐపీఎల్ కెరీర్ తర్వాత అతను భారత జూనియర్ జట్టు, అండర్-19, ఇండియా ఏ జట్లకు కోచ్‌గా చేశాడు. టీమిండియా జట్టుకు కోచ్‌గా బాధ్యతలు చేపట్టడానికి ముందు వరకు.. బెంగుళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీ హెడ్‌గా చేశాడు. ఇక ఇప్పుడు ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్‌కు కోచింగ్ బాధ్యతలు చేపట్టే అవకాశాలు ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి.

## ఒలింపిక్స్‌లో రెండు స్వర్ణాలు గెలుచుకున్న ఈ క్రికెటర్ భార్య పారిస్ ఒలింపిక్స్‌కు దూరం.. రీజన్ ఏమిటంటే?

ఆస్ట్రేలియా ఆల్ రౌండర్ మాథ్యూ షార్ట్ ప్రముఖ ౨20 క్రికెటర్. గత సీజన్‌లో ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్ తరఫున కూడా ఆడాడు. భారత్‌తో జరిగిన వన్డే సిరీస్‌తో పాటు టీ20 సిరీస్‌లోనూ పాల్గొన్నాడు.అయితే మాథ్యూ షార్ట్ నిజ జీవితంలో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. అతని భార్య ఒలింపిక్ బంగారు పతక విజేత. అది కూడా రెండు సార్లు గోల్డ్ మెడల్స్ ను అందుకుంది. మాథ్యూ షార్ట్ భార్య పేరు మాడిసన్ విల్సన్. ఆమె ఆస్ట్రేలియాకు చెందిన ప్రొఫెషనల్ స్విమ్మర్. విల్సన్ రెండుసార్లు ఒలింపిక్ స్వర్ణాన్ని గెలుచుకున్నాడు బ్యాక్‌స్ట్రోక్ , ఫ్రీస్టైల్‌లో నైపుణ్యం కలిగిన మాడిసన్ విల్సన్ రియో?ఒలింపిక్స్ లో స్వర్ణం, రజత పతకాలను గెలుచుకుంది.టోక్యో ఒలింపిక్స్‌లో టీమ్ ఈవెంట్‌లో మాడిసన్ విల్సన్ స్వర్ణ పతకాన్ని కూడా గెలుచుకుంది. అయితే మాడిసన్ జూన్ 26 నుంచి పారిస్ లో జరగనున్న వేసవి ఒలింపిక్స్‌లో పాల్గొనడం లేదు పారిస్ ఒలింపిక్స్‌లో మాడిసన్ ఆడకపోవడానికి కారణం చాలా ప్రత్యేకమైనది. మాడిసన్ గర్భవతి.. ఆమె త్వరలో తల్లి కాబోతోంది. అందుకనే వరసగా ఒలింపిక్స్ లో పతకం సంపాదించే అరుదైన అవకాశానికి



దూరంగా ఉంది ... మాతృత్వం ఆనందాన్ని అందుకోవడానికి ఎదురుచూస్తోంది

## అరంగేట్ర మ్యాచ్‌లో ఏడు వికెట్లు.. స్కాట్లాండ్ బౌలర్ ప్రపంచ రికార్డు

డుండె: స్కాట్లాండ్ యువ పేసర్ చార్లి కాసెల్ ఆడుతున్న తొలి మ్యాచ్‌లోనే ఏడు వికెట్లు (7/21) పడగొట్టి సరికొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. ఐసీసీ పురుషుల క్రికెట్ వరల్డ్ కప్ లీగ్ 2 లో భాగంగా ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో 5.4 ఓవర్లు వేసిన కాసెల్ ఒక ఓవర్ మెయిడిన్ చేయడమే గాక 21 పరుగులే ఇచ్చి 7 వికెట్లు తీశాడు. తాను వేసిన తొలి ఓవర్లోనే మూడు వికెట్లు పడగొట్టాడు.తద్వారా తొమ్మిదేండ్ల క్రితం బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో సౌతాఫ్రికా పేసర్ కగిసో రబాడ నెలకొల్పిన రికార్డు (6/16) రికార్డు కనుమరుగైంది. కాసెల్ దెబ్బకు ఒమన్ 21.4 ఓవర్లలో 91 పరుగులకే ఆలౌట్ అయింది. లక్ష్యాన్ని స్కాట్లాండ్ 17.2 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. అంతర్జాతీయ వన్డే క్రికెట్ చరిత్రలో ఇలాంటి ఫీట్ తొలిసారి నమోదు కావడం విశేషం.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY BYAGAL SRINIVAS, PRINTED AT S.S. PRINTERS & FILE MAKERS, PUS ALAGALLY, JAWAHAR ROAD, Town & Dist.NIZAMABAD- 503001, TELANGANA STATE, PUBLISHED AT H.NO: 6-11-174/1, NAMDEVWADA, Town & Dist. NIZAMABAD, TELANGANA STATE - 503001.EDITOR: BYAGAL SRINIVAS.